# అన్నదాతలపై మిగ్‌జాం తుఫాన్ పడగ

- కల్లాల్లో ధాన్యం, చేలలో పత్తి
- ఆందోళనలో రైతన్నలు




తాళ్ల పేటలో ధాన్యం కుప్పలపై కవర్లు కప్పిన రైతులు

దండేపల్లి, డిసెంబర్ 5 : ప్రస్తుతం దండేపల్లి మండలంలో వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ధాన్యం చేతి కొస్తున్న వేళ మిగ్‌జాం తుఫాన్ అన్నదాతలకు ఆందోళన కలిగిస్తున్నది. మంగళవారం ఉదయం నుంచి వాతావరణంలో అక్కడక్కడ మార్పులు సంభవించాయి. కొన్ని చోట్ల చిరుజల్లులు కురవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. చేతి కొచ్చిన ధాన్యాన్ని, చేలల్లో ఉన్న పత్తిని కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. తేమ రావడానికి ఆరబోసిన ధాన్యాన్ని కుప్పగా పోసి కవర్లు కప్పుకుంటున్నారు.

## నిరుపేద యువతి వివాహానికి సాయం



యువతికి బంగారు ఉంగరాన్ని అందిస్తున్న కౌన్సిలర్ బోరిగం శ్రీనివాస్

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 5: నిరుపేద యువతి వివాహానికి బంగారు ఉంగరాన్ని అందించి మంచిర్యాల మున్సిపాలిటీలోని 16వ వార్డు కౌన్సిలర్ బోరిగం శ్రీనివాస్ తన ఉదారతను చాటుకున్నారు. పట్టణంలోని చెరువుకట్ట ఏరియాలో నివసించే సమ్మెట వర్ష వివాహం ఈ నెల 7న జరుగనున్నది. అమ్మాయి తండ్రి శ్రీనివాస్ చాలా ఏళ్ల క్రితం చనిపోగా తల్లి ధనలక్ష్మి పిల్లలను పెంచి పెద్ద చేసింది. అమ్మాయి బంధువులు సమ్మెట సాగర్, అర్చన ద్వారా పెళ్లి విషయాన్ని తెలుసుకున్న కౌన్సిలర్ బోరిగం శ్రీనివాస్ తనవంతు సాయంగా రూ. 16 వేలు విలువైన పావుతులం బంగారు ఉంగరాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వర్ష కుటుంబ సభ్యులు బోరిగం శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్

లక్సెట్టిపేట, డిసెంబర్ 5: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులానికి చెందిన ఆరుగురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. గత నెలలో స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 19 జోనల్ స్థాయి క్రీడలు పరుగుపందెంలో రక్షిత, షాట్‌పుట్‌లో మనోహరిక, హైజంప్‌లో దీపిక, 400మీటర్ల పరుగు పందెంలో సంజన, 800మీటర్ల పరుగుపందెంలో స్వర్ణతో పాటు 3కేఎంలో కుంకుమ అనే విద్యార్థినులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను కళాశాల ప్రిన్సిపాల్ లలిత కుమారి మంగళవారం క్యాంపస్‌లో సత్కరించి అభినందించారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 7 నుంచి 9 వరకు హన్మకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వర్‌రావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బాబూరావుతో పాటు కళాశాల, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## 12 నుంచి గీత ప్రశాంతి నిలయం రజతోత్సవాలు



గీతా ప్రశాంతి నిలయం రజతోత్సవ పోస్టర్ విడుదల చేస్తున్న భక్తులు

శ్రీరాంపూర్, డిసెంబర్ 5 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 6కాలనీలోని గీతా ప్రశాంతి నిలయం 25వ రజతోత్సవాల పోస్టర్‌ను శ్రీ మత్ భగవద్గీత సత్సంగ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు దాసరి రాజేశం విడుదల చేశారు. మంగళవారం గీతా ప్రశాంతి నిలయం వద్ద భక్తులతో కలిసి రజతోత్సవ వేడుకలు వివరించారు. ఈ నెల 12 నుంచి 19 వరకు గీతా జ్ఞాన సప్తాహ, 20న భక్తులచే కోలాటాల నృత్యాలతో శోభాయాత్ర, 21న సామూహిక లక్ష్మీ పూజలు, 22న, 23 గీతా హవన యజ్ఞం, గీత ప్రవచనాలు, ఉపన్యాసాలు, అన్నదానాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గీతా ప్రశాంతి నిలయం రజతోత్సవాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ మత్ భగవద్గీత సత్సంగ్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి డీడీ ప్రసాద్, రాజమౌళి, లక్ష్మీనారాయణ, సభ్యులు మల్లేశ్, ఎం సారయ్య, శ్రీనివాస్, సమ్మయ్య, మనోహర్, రాంబాబు, స్వర్ణకుమారి, రమాదేవి, వినోద, సుశీల, మాధవి, పద్మ లక్ష్మి పాల్గొన్నారు.

## రేపటిలోగా 'పది' పరీక్ష ఫీజు చెల్లించాలి

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 5 : పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు 2024, మార్చిలో జరిగే వార్షిక పరీక్ష ఫీజు ఈ నెల ఏడవ తేదీలోపు చెల్లించాలని డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో కోరారు. అన్ని సబ్జెక్టులకు రూ. 125, మూడు సబ్జెక్టులకు రూ. 110, మూడుకంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ. 125, వృత్తి విద్య(వొకేషనల్)కు రూ. 60 అదనంగా అంటే 185 రూపాయలు చెల్లించాలన్నారు. ఈ నెల 14లోపు రూ. 50 అపరాధ రుసుముతో, ఈ నెల 21లోపు రూ. 200 ఫైన్‌తో, 2024, జనవరి మూడవ తేదీలోపు రూ. 500 అపరాధ రుసుముతో చెల్లించవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపారు.

## ఎన్ఎంఎంఎస్ రెన్యూవల్ చేసుకోవాలి

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 5 : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ స్కీం(ఎన్ఎంఎంఎస్) 2022, డిసెంబర్‌లో ఎంపికైన (ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న) విద్యార్థులు, గతంలో ఎంపికైన ప్రస్తుతం 10, 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు రెన్యువల్ అప్లికేషన్లు ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు వారి పాఠశాల లాగిన్ బయోమెట్రిక్ అథెంటికేషన్ కోసం ఈ నెల 6న ఉదయం పది గంటలకు జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర పాఠశాల ఆవరణలోని పాత డీఈవో కార్యాలయానికి రావాలని కోరారు.

## ఘనంగా కృష్ణాకాలనీ సీఎస్ఐ వెస్లీ చర్చి వార్షికోత్సవాలు



వార్షికోత్సవాల్లో పాల్గొన్న క్రిస్టియన్లు

శ్రీరాంపూర్, డిసెంబర్ 5 : శ్రీరాంపూర్ ఏరియా కృష్ణాకాలనీలోని సీ జోన్ వెస్లీ చర్చి 6 వ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. రేవ్ చర్చి పాస్టర్స్ కే సురేశ్, స్వప్న సురేశ్ ఆధ్వర్యంలో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవాళి ప్రశాంత, శాంతి కోసం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ వినయ్‌ప్రశాంత్, అగస్టిన్, ఫిలోమెన్ రాజ్ పాల్గొన్నారు.

## ఎస్ఆర్పీ 3గనిలో ప్రమాదం.. కార్మికుడికి గాయాలు

శ్రీరాంపూర్, డిసెంబర్ 5 : శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఆర్పీ 3గనిలో మంగళవారం ఉదయం జరిగిన ప్రమాదంలో చిట్టూరి వీవీ రామకృష్ణ జనరల్ మజ్దూర్ కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. కార్మికుల తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మంగళవారం జనరల్ షిఫ్ట్‌లో గనిలోని 39 లెవల్, 11 ఎల్ఎన్, 36 రేస్ పని స్థలం వద్ద పుల్లీలో తాడు ఎక్కిస్తున్న క్రమంలో తాడు బెడిసికొట్టి తాకడంతో ఎడమకాలుకు తాకడంతో విరిగింది. వెంటనే రామకృష్ణాపూర్ ఏరియా దవాఖాన నుంచి కరీంనగర్‌కు రెఫర్ చేశారు.

# కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ప్యానల్ టీం తనిఖీలు



కిష్టాపూర్‌లోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో తనిఖీ చేస్తున్న ప్యానల్ టీం అధికారి వై సత్యనారాయణ

జన్నారం, డిసెంబర్ 5 : జన్నారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని మంగళవారం 14 మంది సభ్యులతో కూడిన ప్యానల్ టీం అధికారి వై సత్యనారాయణ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. విద్యాలయంలోని అడ్మిషన్లు, విద్యార్థుల హాజరు రిజిష్టర్ల తనిఖీతో పాటుగా హాస్టల్, విద్యాబోధన అంశాలపై పరిశీలించారు. విద్యాలయ పరిసరాల శుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు స్పెషల్ ఆఫీసర్ ఎస్ శ్రీవాణి తెలిపారు. ఈ తనిఖీలో టీం మెంబర్స్ ఏ సుజాత, డీ రమేశ్, డీ మహేశ్వర్, ఏ రాజు, సీ స్రవంతి, సుమన్, రాజయ్య, బీ శంకర్, మమత, కే కనక లక్ష్మి, పీ రత్నమాల, మాణిక్ హోలికేడ్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలు నమోదు చేయాలి

- విద్యాధికారి వాసాల ప్రభాకర్
- ఉపాధ్యాయులకు యూడైస్ ప్లస్‌పై అవగాహన



ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో వాసాల ప్రభాకర్

కాసిపేట, డిసెంబర్ 5 : ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో పాఠశాలల విద్యార్థుల వివరాలు, సౌకర్యాలపై పూర్తి స్థాయిలో నమోదు చేయాలని కాసిపేట మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ సూచించారు. మంగళవారం కాసిపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో మండల స్థాయి యూడైస్ ప్లస్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాలలకు సంబంధించి విద్యార్థుల వివరాలతో పాటు పాఠశాలలకు కావాల్సిన సదుపాయాలను పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం ఈ వివరాల ఆధారంగానే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంలు, పాఠశాలలకు సౌకర్యాలు మంజూరవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి నెన్నెల లచ్చయ్య, కాంప్లెక్స్ హెచ్ఎంలు సాంబమూర్తి, రాథోడ్ రమేశ్, సుధాకర్ నాయక్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, సీసీవో రాంబాబు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సౌజన్య, సీఆర్పీలున్నారు.

## 8న అయ్యప్ప మహా పడి పూజ

శ్రీరాంపూర్, డిసెంబర్ 5 : ఈ నెల 8న శుక్రవారం శ్రీరాంపూర్ కాలనీలోని ప్రగతి స్టేడియంలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో అయ్యప్ప స్వాములు సామూహికంగా మహా మండల పడి పూజ, అయ్యప్ప స్వాముల అగ్ని ప్రవేశం (అగ్ని గుండాలు) కార్యక్రమం పోస్టర్‌ను మంగళవారం జీఎం బీ సంజీవరెడ్డి విడుదల చేశారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ (ఏబీఏపీ) శ్రీరాంపూర్ అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్ వేర్వేరుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ శ్రీరాంపూర్ ఏరియా ప్రధాన కార్యదర్శి భాస్కర రాజేశం, ఉపాధ్యక్షులు మెడవేన చందర్, వంగ శివకుమార్, కార్యదర్శి ముల్కల రవి కృష్ణ, సురేందర్, ఐలయ్య, హరీశ్, శ్రావణ్, బన్నీ, పుట్ట రవి, ప్రసాద్, బొద్దున రమేశ్, చారి, రామలింగం, కుమారస్వామి, ఆర్ మధు, సిద్ధార్థ, దాసరి నవీన్, సీహెచ్ సదానందం, వేణు, రాజు, రమేశ్, కొండాల్‌రెడ్డి, అశోక్, రంజిత్, శ్రీకాంత్, ఐలయ్య, వంగ శ్రీనివాస్, రాజ్‌కుమార్, సత్తయ్య, క్రాంతి, కిషన్ పాల్గొన్నారు.

## 8న ఉచిత గ్రహణ మొర్రి స్క్రీనింగ్ క్యాంపు

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 5 : బసవతారకం స్మైల్ ట్రైన్ సెంటర్, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ దవాఖాన, సమగ్ర శిక్ష డాక్టర్ ముకుంద రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 8న ఉచిత గ్రహణ మొర్రి నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య మంగళ వారం తెలిపారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని, ఆరు నెలల వయస్సు నుంచి 50 సంవత్సరాల వయసు గలవారు ఈ శిబిరానికి హాజరు కావచ్చన్నారు. గ్రహణ మొర్రి (పెదవి చీలిక, అంగిలి చీలిక) నిర్ధారణ అయిన వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తారని, మందులు సైతం ఉచితంగా అందజేస్తారన్నారు. అంతే కాకుండా ఆపరేషన్ తరువాత మాట్లాడడంలో శిక్షణ, దంతాల అమరిక సరిచేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.